# ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్

- మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఏజెన్సీ వాసులకు మరో తీపి కబురు
- కృతజ్ఞతలు తెలిపిన పోచంపల్లి, నాగజ్యోతి

ఏటూరునాగారం, అక్టోబర్ 8 : ఏటూరునాగారానికి ఫైర్ స్టేషన్ మంజూరు చేస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించిన 24 గంటల్లోనే మరో తీపి కబురును ఏజెన్సీ వాసులకు ప్రభుత్వం అందజేసింది. ఇక్కడ ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని ఫైర్ స్టేషన్ మంజూరు చేయించారు. ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు అగ్ని మాపక కేంద్రం అందుబాటులో లేకపోవడం వల్ల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. గతంలో ఎన్నోసార్లు ఈ ప్రాంత ప్రజలు మొరపెట్టుకున్నప్పటికీ ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. తాజాగా ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీని నిర్వహణకు అవసరమయ్యే సిబ్బందిని కూడా పెద్ద ఎత్తున నియమించనుంది. 34 రెగ్యులర్ పోస్టులతో ఈ అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు కానుంది. ఒక అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి, ఇద్దరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్లు, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఐదుగురు ఆపరేటర్లు, 20 మంది అగ్ని మాపక సిబ్బంది, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక స్వీపర్ ఈ కేంద్రంలో విధులు నిర్వర్తించనున్నారు. నిర్వహణ కోసం రూ. 3.46 కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.



### కేసీఆర్ రుణం తీర్చుకుంటారు

**- పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ**

ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్ మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ములుగు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండదండగా నిలవాలని ఆయన ములుగు ప్రజలను కోరారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని గెలిపించి సీఎం కేసీఆర్ రుణాన్ని ప్రజలు తీర్చుకుంటారని తెలిపారు. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి ఫైర్ స్టేషన్ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

### పెద్ద మనసుతో మంజూరు చేశారు

**- బడే నాగజ్యోతి, జడ్పీ చైర్ పర్సన్, ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి**

ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్‌ను రెండు యూనిట్లతో ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఫైర్ స్టేషన్ మంజూరుకు సహకరించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాష్, రెడ్కో చైర్మన్ సతీశ్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జిల్లా ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అధికంగా ఏజెన్సీ ప్రాంతం, అడవులున్నాయని, ఫైర్ స్టేషన్ అగ్ని ప్రమాదాల నివారణకు ఉపకరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి పెద్ద మనసుతో ములుగు జిల్లాకు అన్ని వసతులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ ఓటు ద్వారా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని నాగజ్యోతి పేర్కొన్నారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

## ఎస్టీ హాస్టల్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

ములుగు రూరల్, అక్టోబర్ 8 : ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డ కాలనీలో ఉన్న ఎస్టీ బాలికల హాస్టల్‌ను డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ మేరకు హాస్టల్‌లోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ దవాఖానకు తీసుకురావాలని వార్డెన్‌కు సూచించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది గంగ, నర్సమ్మ, సావిత్రి, వార్డెన్ ఓదెమ్మ ఉన్నారు.



చీరెలు అందజేస్తున్న నర్సింహారావు, వలియాబీ

## బతుకమ్మ చీరెల పంపిణీ

ఏటూరునాగారం, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని రేషన్ షాపులో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకునేందుకు సీఎం కేసీఆర్ చీరెలను పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వలీబాబా, తాడూరి రఘు, గండేపెల్లి నర్సయ్య, ప్రదీప్‌రావు, బాస పుల్లయ్య, మెరుగు వెంకటేశ్వర్లు, నాగరాజు, కోట నర్సింహులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ములుగు రూరల్, అక్టోబర్ 8 : మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి ఆదివారం పరామర్శించారు. దేవగిరిపట్నంలో మాజీ ఎంపీటీసీ జగన్నాథం, ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డకు చెందిన పాముకంట్ల ఏసేపు, బండారుపల్లిలో ఎంపీటీసీ సుజాత మామ ఇంద్ర మలిశెట్టి, అంకన్నగూడెంలో చింత నారాయణ తల్లి యాకమ్మ మృతి చెందగా వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

## అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 8 : అసాంఘిక శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై రేఖ అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని బెస్తగూడెంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

**కోయవీరాపురంలో..**

వాజేడు : మండలంలోని కోయవీరాపురంలో ఆదివారం వాజేడు ఎస్సై చావాళ్ళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే సమాచారమందించాలని, వారికి ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

# 20 మంది జీపీ కార్యదర్శుల బదిలీ

ములుగు, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో వివిధ గ్రామపంచాయతీలలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాపూర్ మండలం కేశవాపూర్ జీపీలో పనిచేస్తున్న సయ్యద్‌పాషాను మంగపేట మండలం కొత్తమొట్లగూడెంకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న సంగీతను కేశవాపూర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ములుగు మండలం సర్వాపురంలో పనిచేస్తున్న పీ శ్రీధర్‌ను మంగపేట మండలంలోని కోతిగూడెంకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న అజ్మత్‌పాషాను సర్వాపురంకు బదిలీ చేశారు. ములుగు మండలం కొడిశలకుంట జీపీలో పనిచేస్తున్న డీ సుధీర్‌ను మంగపేట మండలంలోని వాగొడ్డుగూడెంకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న సీహెచ్ కృష్ణాజీని కొడిశలకుంటకు బదిలీ చేశారు. ములుగు మండలంలోని జాకారం జీపీలో పనిచేస్తున్న కిషోర్‌కుమార్‌ను మంగపేట మండలంలోని మల్లూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ఎల్లస్వామిని జాకారంకు బదిలీ చేశారు. వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లిలో పనిచేస్తున్న ఎం పరమ్ సింగ్‌ను మంగపేట మండలంలోని నర్సింహసాగర్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న రూప్‌సింగ్‌ను పాపయ్యపల్లికి బదిలీ చేశారు. వెంకటాపూర్ మండలం లింగాపూర్ జీపీలో పనిచేస్తున్న జే అరుణ్‌ను మంగపేట మండలం కమలాపురానికి, అక్కడ పనిచేస్తున్న ఎస్ మురళిని లింగాపూర్‌కు బదిలీ చేశారు. గోవిందరావుపేట మండలం మొట్లగూడెంలో పనిచేస్తున్న శ్రీతేజను మంగపేట మండలం నర్సాయిగూడెం జీపీకి బదిలీ చేశారు. మంగపేట మండలంలోని దోమెడ జీపీలో పనిచేస్తున్న ఎ సృజనను గోవిందరావుపేట మండలం మొట్లగూడెం జీపీకి బదిలీ చేశారు. మంగపేట మండలంలోని వాడగూడెం జీపీలో పనిచేస్తున్న ఎస్కే సలీంను అదే మండలంలోని కొత్తమల్లూరుకు, అక్కడ పనిచేస్తున్న పీ వనజను వాడగూడెంకు బదిలీ చేశారు. మంగపేట మండలం బోర్నర్సాపురం జీపీలో పనిచేస్తున్న పీ విద్యావతిని ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు బదిలీ చేశారు. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జీపీలో పనిచేస్తున్న ఎం అజన్‌కుమార్‌ను మంగపేట మండలం బాలన్నగూడెంకు, అక్కడ పనిచేస్తున్న బీ సాంబమూర్తిని లక్నవరం జీపీకి బదిలీ చేశారు. అలాగే మంగపేట మండలం నర్సాయిగూడెంలో పనిచేస్తున్న వై వేణుగోపాల్‌ను అదే మండలంలోని దోమెడ కార్యదర్శిగా నియమించారు.

# రామప్పలో సండే సందడి

- సందర్శించిన విదేశీయులు
- నూతన తహసీల్దార్, పురావస్తు శాఖ అధికారుల పూజలు



రామప్ప ఆలయంలో విద్యార్థులు

వెంకటాపూర్, అక్టోబర్ 8 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేల మంది పర్యాటకులతో పాటు అమెరికాకు చెందిన మిచెల్లీ పెర్రినాడ్, మరియా అంటోని, ట్రాక్స్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాముఖ్యతను స్టేట్ టూరిస్ట్ గైడ్ మోహన్, స్థానిక గైడ్‌ల ద్వారా తెలుసుకున్న విదేశీయులు రామప్పలోని శిల్పాలను ఫొటోలు తీసుకున్న అనంతరం చెరువును సందర్శించారు. కాగా, ఆదివారం రామప్ప దేవాలయాన్ని నూతన తహసీల్దార్ ఎం శివకుమార్, పురావస్తు శాఖ అధికారులు దర్శించుకొని శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురావస్తు శాఖ ఏఈ కృష్ణ చైతన్య, సీఏ మల్లేశ్, గార్డెన్ ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, ఆర్ఐ రమేశ్ తదితరులున్నారు.

## వేతనాలు పెంచడం హర్షణీయం

ములుగు రూరల్, అక్టోబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 29 మినీ గురుకులాల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచడంపై ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీ నిర్మల, నీలావతి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు సంయుక్త ప్రకటనలో సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. 30 శాతం వేతనాలు పెంచడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 418 మంది కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయని తెలిపారు. వేతనం పెంచిన ప్రభుత్వానికి, సహకరించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఏటూరునాగారం, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు, గ్రామస్తులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని సీఐ మండల రాజు ప్రారంభించి మాట్లాడుతూ బ్లడ్ డోనర్స్ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అనేక మందికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు. దాతలను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు వహీద్, అజ్మత్‌ఖాన్, కత్తెర శ్రీనివాస్, బచ్చు సతీశ్, తడక సుమన్, అబ్బు సతీశ్, కోడెల నరేశ్, కర్నె ప్రణయ్ ప్రసాద్, అల్లంల చంటి, పూజారి వెంకటేశ్, సుమన్, చిడెం ప్రకాష్, అఫ్జల్ పాషా, పెండ్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఐతూర్

ఏటూరునాగారం, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుడు టీ ఐతూర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కోచ్ కుమారస్వామి తెలిపారు. హనుమకొండ ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19లో పోటీల్లో ఆదివారం జావెలిన్‌త్రో విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐతూర్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

## లక్ష్మీనర్సింహుడికి అభిషేక పూజలు

మంగపేట, అక్టోబర్ 8 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామికి ఆదివారం అభిషేకం పూజాక్రతువులు నిర్వహించారు. ఉదయాన్నే దేవస్థాన అర్చకులు స్వామివారికి తిలతైలాభిషేకం చేసి ప్రత్యేక వస్త్రాలు, పూలతో అలంకరించి, పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల భక్తులు గుట్టకు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. దీనికి ముందు భక్తులు చింతామణి జలధారను సందర్శించారు. ఆలయ అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



సమ్మక్క దేవతకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## మేడారానికి తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, అక్టోబర్ 8 : మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, సారె, బంగారం, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.